# మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించండి

- కారు గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించండి
- మన బలగాన్ని చూసి.. ఢిల్లీ గులాంలు భయపడుతున్నారు
- మీర్‌పేటలో కార్యకర్తల సమావేశంలో మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి



మీర్‌పేటలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, తదితరులు

బడంగ్‌పేట, అక్టోబర్ 28: మీ ఇంటి ఆడబిడ్డను ఆశీర్వదించండి.. కారు గుర్తుకు ఓటేసి భారీ మెజీర్టీతో గెలిపించండని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మీర్‌పేటలో శనివారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి.. కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలగాన్ని చూసి.. ఢిల్లీ గులాంలు భయపడుతున్నారని.. సబితమ్మపై పోటీ చేయడానికి ఎవరిని పెట్టాలో ఢిల్లీలో చర్చలు జరుగుతున్నాయంటే ఎంత భయం ఉందో అర్థం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోను చూసి ప్రతిపక్ష పార్టీలకు దిమ్మతిరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజా సంక్షేమనికి పెద్దపీట వేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించే బాధ్యత తనదేనన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు మేలు చేశామని. తప్పుడు ఆరోపణలు చేసిన వారికి ఓటు ద్వారా ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కార్పొరేటర్లు భూపాల్ రెడ్డి సిద్దాల బీరప్ప, అనిల్ కుమార్ యాదవ్, సిద్దాల లావణ్య, నవీన్ గౌడ్, గజ్జల రాంచందర్, బాలమణి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేశ్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్ గౌడ్, శ్రీను నాయక్, ఆర్.నర్సిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



మీర్‌పేటలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు

## రేపు మండల సర్వసభ్య సమావేశం

మహేశ్వరం, అక్టోబర్ 28: అక్టోబర్ 30న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్ అధ్యక్షతన జరిగే సమావేశానికి సంబంధిత సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## తండ్రీకూతురు అదృశ్యం





తండ్రీకూతురు కమలాకర్, నౌషిత (ఫైల్)

బడంగ్‌పేట్, అక్టోబర్ 28: తండ్రీకూతురు అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ గ్రామానికి చెందిన శ్రీదేవి.. కమలాకర్‌కు ఇద్దరు సంతానం. ఈనెల 25 ఉదయం కమలాకర్ తన కుమారుడిని ఇంటి వద్దే వదిలేసి.. తన కూతురు నౌషితతో కలిసి ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కందుకూరు, అక్టోబర్ 28 : ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కందుకూరు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 30న జరిగే శాసనసభ ఎన్నికల దృష్ట్యా శనివారం మండల పరిధిలోని లేమూరు, మాదాపూరు, గుమ్మడవెల్లి, రాచులూరు, తిమ్మాపూరు, బేగంపేట్ గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి కందుకూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది కవాతు నిర్వహించి ప్రజలకు ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎవరికీ భయపడకుండా ఓటు వేయాలని తెలిపారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఘట్టి పోలీస్ బందోబస్తున్న ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేటలో శుక్రవారం రాత్రి ఎన్నికల కార్యాలయాన్ని సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం బీఎర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మంత్రి సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

– మహేశ్వరం, అక్టోబర్ 28



## ప్రజలకు న్యాయ సేవా వారధిగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 28: తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన ప్యారా లీగల్ వలంటీర్లకు శనివారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్యారా లీగల్ వలంటీర్లు ప్రజలకు, సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన వారికి, సమాన గౌరవంతో జీవించే హక్కు గురించి తెలుసుకునేలా రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా హామీ ఇవ్వాలని తెలిపారు. ప్యారా లీగల్ వలంటీర్లు వివాదాలు, సమస్యలు, సమస్యల స్వభావాన్ని గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా మాట్లాడుతూ.. వలంటీర్లు జిల్లా న్యాయ సేవ సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ సంస్థ నుంచి సరైన అధికారంతో జైళ్లు, లాక్-అప్‌లు, సైకియాట్రిక్ హాస్పిటల్స్, చిల్డ్రన్స్ హోమ్‌లు, అబ్జర్వేషన్ హోమ్‌లను సందర్శించాలని తెలిపారు. పీఎల్‌వీలు బాలల హక్కుల ఉల్లంఘనలు, బాల కార్మికులు, తప్పిపోయిన పిల్లలను, బాలికల అక్రమ రవాణాను సమీప న్యాయ సేవల సంస్థలకు లేదా శిశు సంక్షేమ కమిటీకి నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దీపికారెడ్డి, విద్యరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే బీజేపీని చిత్తుగా ఓడించాలి



మాల సంఘాల జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు రామచందర్

ఆర్కేపురం, అక్టోబర్ 28 : ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలను త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్, తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్ తెలిపారు. శనివారం కొత్తపేటలోని పాపడం హోటల్లో 33 జిల్లాల మాల సంఘాల నాయకులు, మాల మేధావులు, కవులు, రచయితలు, ఉద్యోగ సంఘాల నాయకుల మాల సంఘాల జేఏసీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాల సంఘాల అభిప్రాయాలను పంచుకున్నారు. మాలలకు అన్ని విధాలుగా న్యాయం చేసి, మాల భవనం కోసం 5 ఎకరాల స్థలం కేటాయించి నిర్మాణం కోసం రూ.10కోట్లు కేటాయించే వారికే అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని తీర్మాణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 45 లక్షల మంది మాలల భవిష్యత్తు కోసం మాలల సత్తా ఎంటో రేపు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చూపిస్తామని చెప్పారు. ముఖ్యంగా వర్గీకరణకు మద్దతు ఇచ్చే బీజేపీ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి రవి, రావుల అంజయ్య, మంత్రి నరసింహయ్య, భీంసేన, తుమ్మ శ్రీనివాస్, గుడిమల్ల వినోద్ కుమార్, సుమన్, నానుతో పాటు 33 జిల్లాల నుంచి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి

కందుకూరు, అక్టోబర్ 28 : మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని యువజన విభాగం రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తెలిపారు. మైనార్టీలను అన్ని రంగాల్లో ఆదుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. శనివారం మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో కార్తీక్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. మహేశ్వరంలో బీఆర్ఎస్ అభ్యర్థి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి అండగా ఉండాలని కోరారు. ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే మైనార్టీలను ఆదుకోవడానికి కృషి చేస్తుందని తెలిపారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సబితా ఇంద్రారెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎండీ దావుద్, ఎండీ అంజద్, మండల మైనార్టీ అధ్యక్షుడు అలీ, పలువురు పాల్గొన్నారు.



మైనార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి